నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
17 వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
బుధవారం
08 మే 2024
పేజీలు: 02





542 రన్స్ 18 వికెట్స్

## పాయింట్స్ టేబుల్

| టీమ్ | ఆడినవి | గెలిచినవి | ఓడినవి | రన్ రేట్ | పాయింట్స్ |
|---|---|---|---|---|---|
| కోల్‌కతా | 11 | 8 | 3 | 1.45 | 16 |
| రాజస్తాన్ | 11 | 8 | 3 | 0.47 | 16 |
| చెన్నై | 11 | 6 | 5 | 0.70 | 12 |
| హైదరాబాద్ | 11 | 6 | 5 | -0.06 | 12 |
| ఢిల్లీ | 12 | 6 | 6 | -0.31 | 12 |
| లక్నో | 11 | 6 | 5 | -0.37 | 12 |
| బెంగళూరు | 11 | 4 | 7 | -0.04 | 8 |
| పంజాబ్ | 11 | 4 | 7 | -0.18 | 8 |
| ముంబై | 12 | 4 | 8 | -0.21 | 8 |
| గుజరాత్ | 11 | 4 | 7 | -1.32 | 8 |

## నేటి మ్యాచ్

హైదరాబాద్ X లక్నో

హైదరాబాద్ రా.7.30

## మేనల్లుడికి మాయావతి షాక్



బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి మంగళవారం కీలక నిర్ణయం తీసుకున్నారు. తన మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌కు ఊహించని షాక్ ఇచ్చారు. ఆయనను తన వారసుడిగా చేయాలనే నిర్ణయాన్ని మాయావతి ఉపసంహరించుకున్నారు. అంతేకాకుండా పార్టీలో ముఖ్యమైన పదవుల నుంచి ఆయనను తొలగించారు. దీనికి గల స్పష్టమైన కారణాలు తెలియలేదు. ఇప్పటి వరకు బీఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవిలో ఆకాష్ ఆనంద్ కొనసాగారు.

## కేరళలో మళ్లీ వెస్ట్ నైల్ వైరస్.. జిల్లాలకు అలర్ట్ జారీ



కేరళలో 'వెస్ట్ నైల్' వైరస్ కేసులు మళ్లీ వెలుగు చూస్తున్నాయి. త్రిస్సూర్, మలప్పురం, కొజికోడ్ జిల్లాల్లో తాజాగా 'వెస్ట్ నైల్' ఫీవర్ కేసులు నమోదైనట్టు కేరళ ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. దీంతో అప్రమత్తంగా ఉండాలని అన్ని జిల్లాలకు ఆదేశాలు జారీ చేసింది. క్యూలెక్స్ దోమలతో ఈ జ్వరాలు వస్తున్నాయని, వీటి నివారణకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని అందులో సూచించారు.



## చంద్రబాబు బెయిల్ రద్దు కేసు 10 వారాలు వాయిదా

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెదేపా అధినేత చంద్రబాబుకు ఏపీ హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దుచేయాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు 10 వారాలకు వాయిదా వేసింది. 17ఏ అంశంపై త్రిసభ్య ధర్మాసనం నిర్ణయం వెలువడ్డాక దీన్ని పరిశీలిస్తామని జస్టిస్ బేలా ఎం. త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. విచారణలో ఏపీ సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ వాదిస్తూ 17ఏ అంశాన్ని త్రిసభ్య ధర్మాసనానికి ప్రతిపాదించిన కేసు పెండింగ్‌లో ఉందని, దానిపై నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. జస్టిస్ త్రివేది స్పందిస్తూ ఆ అంశం తేలాక ఈ కేసును విచారణకు స్వీకరిస్తామని చెప్పొచ్చా అని ప్రశ్నించారు.



## దేశంలో పట్టాలెక్కనున్న తొలి ప్రైవేట్ రైల్

దేశంలోని తొలి ప్రైవేటు రైలు వచ్చే నెల 4 నుంచి ప్రారంభం కానుంది. కేరళలోని తిరువనంతపురం నుంచి గోవా వరకూ రాకపోకలు సాగించనుంది. SRMPR గ్లోబల్ రైల్వేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ రైలు సర్వీసును నిర్వహిస్తుంది. భారత్ గౌరవ్ యాత్ర ప్రాజెక్టులో భాగంగా భారతీయ రైల్వే, ప్రిన్సి వరల్డ్ ట్రావెల్స్ ప్రైవేటు లిమిటెడ్ సంయుక్త సహకారంతో ఈ సర్వీసును నిర్వహిస్తారు.



## రాజన్న సన్నిధిలో మోదీ ప్రత్యేక పూజలు

వేములవాడ ఆలయంలో ప్రధాని మోదీ ప్రత్యేక పూజలు చేశారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు ప్రధాని మోదీ. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటిస్తున్నారు. ఈరోజు రెండు సభల్లో పాల్గొన్ని ప్రచారం నిర్వహించనున్నారు. అయితే ఇందులో భాగంగా ముందుగా వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు బయలుదేశారు. హైదరాబాద్ రాజ్ భవన్ లో మంగళవారం బస చేసిన ప్రధాని బుధవారం బేగంపేట నుంచి వేములవాడ చేరుకున్నారు. అక్కడ ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ప్రధాని మోదీకి స్వాగతం పలికారు. ఆ తరువాత ఆలయంలోని మహానందికి పుష్పాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గోమాతకు కూడా పూజలు నిర్వహించినంతరం ఆలయంలో ప్రదక్షిణ చేస్తూ రాజరాజేశ్వర స్వామి గర్భాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆలయ ప్రధాన అర్చకులు మోదీకి తిలకధారణ చేసి స్వామివారికి పుష్పార్చనలు నిర్వహించారు. తదనంతరం హారతి కళ్లకు అద్దుకుని మొక్కులు చెల్లించుకున్నారు ప్రధాని మోదీ. ఈ సందర్భంగా ఆలయ ఈవో, ప్రధాన అర్చకులు, వేద పండితులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆపై శాలువా కప్పి సన్మానించారు. స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఇక తిరుగుపయనం అయ్యే క్రమంలో క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు అభివాదం చేస్తూ, వందనం చేస్తూ బయటకు వచ్చారు. ప్రత్యేక హెలికాప్టర్ లో వేములవాడ బహిరంగ సభకు బయలుదేరారు.

### 'కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే'.. వేములవాడ సభలో ప్రధాని మోదీ



తెలంగాణలో బీజేపీ విజయం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో బండి సంజయ్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మే 7న దేశంలో మూడోవిడత లోక్ సభ ఎన్నికల పోలింగ్ జరిగిందని అందులో ఇండియా కూటమి ఫ్యూజ్ పోయిందని విమర్శించారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో ఎన్నికలు జరిగితే మూడింటిలో ఇండియా కూటమి ఫ్యూజ్ పోయిందని ఎద్దేవా చేశారు. వేములవాడకు చేరుకున్న ప్రధాని నరేంద్రమోదీ లోక్ సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు. ప్రధానితోపాటు హెలిప్యాడ్ వద్దకు మరో నాలుగు హెలికాప్టర్లు చేరుకున్నాయి. ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికారు హుజూరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ నేతలు. ఈ క్రమంలోనే బీజేపీ నేతలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు అయన. సభావేదకపైకి చేరుకున్న వెంటనే మోదీకి పలువురు బీజేపీ నేతలు శాలువాలు కప్పి సన్మానించారు. సభలో తన ప్రసంగాన్ని ప్రారంభించే ముందు గతంలోలాగే అందరికీ నమస్కారం అంటూ తెలుగులో మాట్లాడుతూ కార్యకర్తల్లో జోష్ నింపారు. దేశంలో జరుగుతున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. మీ ఓటు వల్లే తాను ఎన్నో నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రజలకు తెలిపారు.



## ఇజ్రాయెల్‌కు భారీ షాకిచ్చిన అమెరికా

అమెరికా మాటలను పెడచెవిన పెట్టి గాజాలోకి చొచ్చుకెళుతున్న ఇజ్రాయెల్‌కు ఓ షాక్ ఎదురైంది. వాషింగ్టన్ నుంచి అందాల్సిన కీలక ఆయుధాల షిప్‌మెంట్‌ను నిలిపేసినట్లు తెలుస్తోంది.ఒక్కోటీ 900 కేజీల బరువుండే 1,800 బాంబులు, 226 కేజీల బరువుండే మరో 1,700 బాంబులు ఇప్పుడు టెల్అవీవ్‌కు అందవు. ఈ విషయాన్ని బైడెన్ కార్యవర్గంలోని కీలక అధికారి ధ్రువీకరించారు. రఫాలో పౌరుల భద్రత, వారికి మానవీయ సాయంపై అమెరికా ఆందోళనలు పట్టించుకోని నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ ఆపరేషన్‌పై అమెరికా మొదటి నుంచి అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది.



## ఆప్‌కు గుడ్‌బై చెప్పిన అమృత్‌సర్ మాజీ మేయర్..!

లోక్‌సభ ఎన్నికల వేళ పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీకి మరో ఎదురుదెబ్బ తగలింది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు, అమృత్‌సర్ మాజీ మేయర్ అవినాష్ జోలి ఆప్‌కు గుడ్‌బై చెప్పారు. అనంతరం బీజేపీ నేతల సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా జోలీ అనుచరులు కూడా పలువురు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పంజాబ్‌లో ఆమ్‌ఆద్మీ పార్టీ అధికారంలో ఉంది. భగవంత్ సింగ్ మాన్ ముఖ్యమంత్రిగా అక్కడ ప్రభుత్వం నడుస్తోంది. అధికార పార్టీలో ఉండి కూడా అవినాష్ జోలీ లోక్‌సభ ఎన్నికల వేళ రాజీనామా ఎందుకు చేయాల్సి వచ్చింది అనేది చర్చనీంయాశమైంది.



## హాట్‌గా పూనమ్ బజ్వా

పూనమ్ బజ్వా.. ఈ బ్యూటీ చేసింది తక్కువ సినిమాలే అయినా.. మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. తన అందాలతో ప్రేక్షకులను కవ్వించింది ఈ వయ్యారి. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ చిత్రాలలో నటించి ప్రేక్షకులను అలరించింది పూనమ్ బజ్వా. తెలుగులో 2005లో వచ్చిన మొదటి సినిమా అనే మూవీతో ప్రేక్షకులను పలకరించింది. ప్రేమంటే ఇంతే సినిమాలో నటించి మెప్పించింది. అయితే ఈ అమ్మడు ఆశించిన స్థాయిలో హీరోయిన్ పాత్రలు దక్కకపోవడంతో సెకండ్ హీరోయిన్‌గాను నటించింది. చివరిగా ఎన్.టి.ఆర్. కథానాయకుడు లో కనిపించింది పూనమ్ బజ్వా. ఆ తర్వాత ఈ బ్యూటీ తెలుగులో సినిమాలు చేయలేదు పూనమ్ బజ్వా.సోషల్ మీడియాలో ఈ చిన్నది చాలా యాక్టివ్ గా ఉంటుంది. పూనమ్ ఎప్పటికప్పుడు రకరకాల ఫోటోలు షేర్ చేస్తూ సోషల్ మీడియాలో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.




## సిక్ లీవ్‌లో ఉద్యోగులు.. రాత్రికి రాత్రే 70 విమానాలు రద్దు

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమాన సంస్థకు చెందిన సీనియర్ సిబ్బంది సామూహికంగా సిక్ లీవ్ తీసుకున్నారు. దీంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు సుమారు 70 విమానాలను రద్దు చేశారు. దీంట్లో అంతర్జాతీయ, దేశీయ విమానాలు కూడా ఉన్నాయి. క్యాబిన్ సిబ్బందికి చెందిన కొంత మంది ఉద్యోగులు చివరి నిమిషంలో సిక్ లీవ్ తీసుకున్నారని, గత రాత్రి నుంచి విమానాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఎయిర్ ఇండియా ప్రతినిధి తెలిపారు. ఎందుకు ఉద్యోగులు ఒకేసారి సిక్ లీవ్‌లో వెళ్లారో తెలియడం లేదని, ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రతినిధి వెల్లడించారు. విమానల రద్దు వల్ల ఇబ్బందులు పడ్డవారికి రిఫండ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. లేదంటే జర్నీ రీషెడ్యూల్ చేయడం జరుగుతుందని ప్రతినిధి తెలిపారు.

## కోవిడ్ టీకాను వెనక్కి రప్పిస్తున్న ఆస్ట్రాజెనికా

ఆస్ట్రాజెనికా కంపెనీ తన కోవిడ్ టీకాను ప్రపంచ మార్కెట్ల నుంచి వెనక్కి రప్పిస్తున్నది. ఆ టీకా వల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఉన్నట్లు కోర్టులో రుజువు కావడంతో బ్రిటీష్ కంపెనీ తన ఉత్పత్తుల్ని వెనక్కి తీసుకుంటున్నది. ఆస్ట్రాజెనికా, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలు ఈ టీకాను తయారు చేశారు. అయితే ఇండియాలో ఆ టీకాను కోవీషీల్డ్ పేరుతో సీరం సంస్థ ఉత్పత్తి చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం మార్కెట్లో కోవిడ్19కు చెందిన అప్‌డేటెడ్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని, వాణిజ్య కారణాల దృష్ట్యా తమ టీకాను మార్కెట్ల నుంచి వెనక్కి రప్పిస్తున్నట్లు ఆస్ట్రాజెనికా కంపెనీ తెలిపింది. కొత్త వేరియంట్లను నియంత్రించగల కొత్త వ్యాక్సిన్లు మార్కెట్లోకి వచ్చేశాయని, అందుకే ఆ టీకాను మార్కెట్ల నుంచి విత్‌డ్రా చేస్తున్నట్లు ఓ మీడియాలో వెల్లడించారు.



సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## నష్టాల్లో స్టాక్ మార్కెట్

అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాల మధ్య దేశీయ సూచీలు బుధవారం నష్టాలతో ప్రారంభమయ్యాయి.ఉదయం 9:27 గంటల సమయంలో సెన్సెక్స్ 267 పాయింట్ల నష్టంతో 73,244 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 35 పాయింట్లు కుంగి 22,276 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.49 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో మారుతీ, రిలయన్స్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఐటీసీ, సన్‌ఫార్మా, టెక్ మహీంద్రా, విప్రో, ఎస్‌బీఐ, టాటా మోటార్స్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఎల్ అండ్ టీ, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టైటన్, ఎం అండ్ ఎం, పవర్‌గ్రిడ్, ఐసీఐసీఐ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.



## రైల్వేలో 4,660 ఉద్యోగాలు

రైల్వే శాఖలో పోలీస్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్‌లో 4,660 ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు దరఖాస్తుల గడువు సమీపిస్తోంది.
అర్హులైన, ఆసక్తికలిగిన అభ్యర్థులు ఈ లింక్‌పై క్లిక్ చేసి మే 14వరకు అప్లయ్ చేసుకోవచ్చు.
మొత్తం పోస్టులు 4,660. వీటిలో 4,208 కానిస్టేబుల్, 452 ఎస్సై ఉద్యోగాలు ఉన్నాయి.
అర్హతలు: కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి; ఎస్సై ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణత తప్పనిసరి.
అభ్యర్థులకు నిర్దిష్టమైన శారీరక ప్రమాణాలు అవసరం. 2024 జులై 1 నాటికి కానిస్టేబుల్ అభ్యర్థుల వయస్సు 18-28 ఏళ్లు, ఎస్సై అభ్యర్థులకు 20-28 ఏళ్ల మధ్య ఉండాలి. ఆయా వర్గాల వారీగా వయో సడలింపు ఇస్తారు.
ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియెన్సీ, ఫిజికల్ మెజర్‌మెంట్ తదితర పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.
వేతనం: ఎస్సై పోస్టులకు రూ.35,400, కానిస్టేబుల్ పోస్టులకు రూ.21,700 చొప్పున ప్రారంభ వేతనంగా ఇస్తారు.

## బాలికపై అత్యాచారం

ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగిన దారుణం తాజాగా వెలుగులోకి వచ్చింది. 16 ఏళ్ల బాలికను నిందితులు మే 3న కిడ్నాప్ చేశారు. అనంతరం ఆమెను బందీని చేశారు. అంతేకాకుండా బలవంతంగా మత్తు పదార్థాలు తాగించి, బాధిత బాలికపై ఏడుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. జరిగిన దారుణంపై పోలీసులకు బాధితురాలి తల్లి మంగళవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు ప్రారంభించారు.



## నలుగురు పిల్లలకు జన్మనిచ్చిన తల్లి

రాజస్థాన్‌లో తాజాగా చాలా అరుదైన ఘటన చోటుచేసుకుంది. జోధ్‌పూర్‌కు చెందిన తుల్సా కన్వర్ అనే 28 ఏళ్ల మహిళ ఒకే ప్రసవంలో నలుగురు పిల్లలకు జన్మనిచ్చింది. ఇవాళ ఉదయం ఆమెకు కటి నొప్పి రావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యులు సిజేరియన్ ద్వారా ప్రసవించారు. ఉదయం 10.55 గంటల నుంచి ఒక్క నిమిషం తేడాతో పిల్లలంతా పుట్టారని తెలిపారు. కానీ కాస్త బరువు తక్కువగా ఉండడంతో వైద్యులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# విషాదం మిగిల్చిన వర్షం.. బాచుపల్లిలో గోడకూలి ఏడుగురు దుర్మరణం



మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నగరంలో కురిసిన కుండపోత వర్షం విషాదం మిగిల్చింది. ఓ భవన నిర్మాణ ప్రాంతంలో రిటెయినింగ్ వాల్ కూలి ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఒక చిన్నారి ఉన్నారు. మృతులంతా ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన కూలీలని అధికారులు తెలిపారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మేడ్చల్ జిల్లా బాచుపల్లిలోని రేణికా ఎల్లమ్మ కాలనీలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. మేడ్చల్ జిల్లా బాచుపల్లి రేణుకా ఎల్లమ్మ కాలనీలోగల సర్వే నెంబర్ 345,406 లలో సుమారు రెండు వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో హరిజన్ రిజ్ కన్స్ట్రక్షన్ కంపెనీ హెచ్ఎండీఏ అనుమతితో సెల్లార్, స్టిల్ట్ +5 అప్పర్ ఫ్లోర్లతో రెసిడెన్షియల్ బిల్డింగ్ నిర్మిస్తున్నది. ఈ భవంతి నిర్మాణంలో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన పలువురు కార్మికులు పనిచేస్తున్నారు. కార్మికులు కన్స్ట్రక్షన్ జరుగుతున్న ప్రదేశంలోనే రేకుల షెడ్స్ వేసుకుని జీవిస్తున్నారు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి భవంతి చుట్టూ నిర్మించిన రిటెయినింగ్ వాల్ కార్మికుల రేకుల షెడ్స్ పై కూలింది. భారీ వర్షంలో ఒక్కసారిగా ఈ ఘటన జరగడంతో కార్మికులు హాహాకారాలు పెడుతూ షెడ్స్ నుంచి బయటికి పరుగులు తీశారు.
ఏడుగురు శిథిలాల కింద చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. ప్రాణాలతో బయటపడిన వారిలో కొందరు గాయపడగా చికిత్స నిమిత్తం మమత హాస్పిటల్‌కు తరలించారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి ఇవాళ తెల్లవారుజాము వరకు కూలిన రిటెయినింగ్ వాల్ శిథిలాలను తొలగించారు. ఆ శిథిలాల కింద నుంచి మొత్తం ఏడు మృతదేహాలను వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆ మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతులంతా ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. మృతుల్లో తిరుపతి మాఝీ (20), శంకర్ (22), రాజు (25), రాజు భార్య ఖుషి (25), రామ్ యాదవ్ (34), గీత (32), హిమాన్షు (4) ఉన్నారు.

## నగరంలో దంచికొట్టిన వాన.. రహదారులన్నీ జలమయం



వేసవి తాపంతో విలవిలలాడిపోతున్న నగరవాసులపై వరుణుడు ఒక్కసారిగా కుంభవృష్టి కురిపించాడు. ఎండల ధాటి నుంచి ఉపశమనం కలిగినా వాన ఒక్కసారిగా దంచికొట్టడంతో నగర రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై గంటల కొద్దీ ట్రాఫిక్ జాం ఏర్పడింది. అనేక చోట్ల విద్యుత్ తీగలు తెగిపడి వందల కొద్దీ కాలనీలు అంధకారంలో మునిగిపోయాయి. వాతావరణ శాఖ ఒక రోజు ముందే నగరానికి భారీ వర్ష సూచన చేసినా జీహెచ్ఎంసీ అధికారులు, విద్యుత్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తం కాని ఫలితం నగర వీధుల్లో స్పష్టంగా కనిపించింది. నిమిషాల్లో పరిస్థితిని చక్కదిద్దాల్సిన ఆయా విభాగపు అధికారులు.. కుండపోత వర్షం పడుతున్నా ఎవ్వరూ సహాయక చర్యల్లో పాల్గొనలేదు. దీంతో నగరవాసులకు రోడ్లపై నరకమే కనిపించింది. సహాయక చర్యలపై బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన సన్నద్ధత, ప్రస్తుత ప్రభుత్వం కనబరచకపోవడంపై నగరవాసులు బాహాటంగానే విమర్శలు కురిపించారు.

## థగ్ లైఫ్‌లోకి శింబు వచ్చేసాడు

యూనివర్సల్ హీరో కమల్ హాసన్ హీరోగా త్రిష హీరోయిన్ గా దర్శకుడు మణిరత్నం కాంబినేషన్ లో తెరకెక్కిస్తున్న భారీ చిత్రం "థగ్ లైఫ్" కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ సినిమాపై భారీ అంచనాలు కూడా ఉన్నాయి. మెయిన్ గా మణిరత్నం, కమల్ నుంచి వస్తున్నా రెండో సినిమా కావడం పైగా ఇద్దరూ కలిపి కథని డెవలప్ చేయడంతో అభిమానుల్లో మరింత ఆసక్తి నెలకొంది. అయితే గత కొన్నాళ్ల నుంచి ఈ చిత్రంలో యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో శింబు కూడా నటిస్తున్నాడు అని కొన్ని రూమర్స్ రాగా ఫైనల్ గా దీనిని అఫీషియల్ గా ప్రకటిస్తూ ఓ సాలిడ్ ఇంట్రో వీడియోతో కూడా రిలీజ్ చేశారు. కొత్త థగ్ సినిమాలోకి ఎంట్రీ ఇచ్చాడు అని అనౌన్స్ చేసేసారు. మరి ఆల్రెడీ, జయంరవి, దుల్కర్ సల్మాన్ లాంటి హీరోలు కూడా ఈ సినిమాలో కీలక పాత్రలు చేస్తుండగా ఇప్పుడు శింబు కూడా జాయిన్ అయ్యాడు. మరి ఈ క్రేజీ ప్రాజెక్ట్ ఎలా ఉంటుందో చూడాలి. ఇక ఈ చిత్రానికి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా రాజ్ కమల్ ఫిల్మ్స్ అలాగే మద్రాస్ టాకీస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.






## వరంగల్ సభలో ఇండియా కూటమిపై మోదీ చురకలు

ఎన్డీయే విజయం మొదటి మూడు విడతల్లోనే తేలిపోయిందన్నారు ప్రధాని మోదీ. కాంగ్రెస్ సీట్లు వెతుక్కోవడానికి మైక్రోస్కోప్ కావాలని ఎద్దేవా చేశారు. తెలంగాణ లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. 40 ఏళ్లక్రితం దేశంలో ఇద్దరు బీజేపీ ఎంపీలు గెలిస్తే అందులో ఒకరు వరంగల్ ఎంపీ ఉండడం ఈ ప్రాంతానికి గర్వకారణమన్నారు. ఓరుగల్లు ప్రజల ఇలవేల్పు భద్రకాళిని, రామప్ప శివుడికి దండం పెట్టుకొని ప్రధాని మోడీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఈ ప్రాంతం కాకతీయుల విజయానికి ప్రతీక అన్నారు. వరంగల్ చారిత్రాత్మకమైన సీటు అని కొనియాడారు. భావితరాల భవిష్యత్ ఉజ్వలంగా ఉండాలంటే మళ్లీ బీజేపీ రావాలన్నారు. ఫిర్ ఎక్ బార్.. మోడీ సర్కార్ అని నినదించారు. ప్రపంచమంతా అనేక విపత్తులు ఎదుర్కొంటుందని.. దేశం దృష్టశక్తుల చేతుల్లోకి వెళ్లకూడదన్నారు. 10 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ఎలాంటి పాపలు చేసిందో ప్రజలు మరిచి పోలేదని గుర్తు చేశారు. కుంభకోణాలు.. బాంబ్ బ్లాస్టింగ్స్ కాంగ్రెస్ పాలనలోనే జరిగాయన్నారు. కూటమి ఐదేళ్లలో ఐదుగురు ప్రధాన మంత్రులు అవుతారని ఎద్దేవ చేశారు. ఈ దేశాన్ని అలాంటి వారి చేతుల్లో పెడదామా..? అని ప్రశ్నించారు. ప్రతీ పార్టీకి ఒక ప్రధానమంత్రి అభ్యర్థి ఉన్నారని.. ఏడాదికి ఓ ప్రధాని చొప్పున ఉంటే ఈ దేశ భవిష్యత్ ఏమై పోతుందో ఆలోచించండని సూచించారు. ఇండియా కూటమికి చురకలు అంటించారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు కోరు అని విమర్శించారు. లోక్ సభ ఎన్నికలు అయిపోగానే కాంగ్రెస్ రుణమాఫీ వట్టి మాటే అని తెలిపారు. సనాతన ధర్మాన్ని తిడుతున్న కాంగ్రెస్ నాయకులు దేవుళ్ల మీద ఒట్లు పెడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విశ్వాసఘాతక పార్టీ అని విమర్శించారు. తెలంగాణలో విద్యుత్ కోతలు పెరిగాయన్నారు. ఇక అభివృద్ధి అయితే ఆగిపోయిందని అలాగే సర్కారు ఖజానా ఖాళీ అయిందన్నారు.
RR ట్యాక్స్ పేరిట..తెలంగాణ ప్రజల డబ్బులు దోచుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నేతల ఇళ్లలో నోట్ల కట్టలు బయటపడుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ దృష్టిలో రాజ్యాంగానికి విలువ లేదన్నారు. చట్టాన్ని సవరించైనా సరే ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలని చూస్తుందన్నారు. ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న కాంగ్రెస్ SC, ST, BC లను విస్మరిస్తుందని ఆరోపించారు. సమ్మక్క సారక్క యునివర్సిటీ నిర్వహణ విషయంలో కాంగ్రెస్ అడ్డుపడుతుందని తెలిపారు. దళిత సామాజికవర్గానికి చెందిన రామ్‌నాథ్ కోవిద్‌ను.. రెండోసారి ఆదివాసీని రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీదే అని చెప్పారు.

## అవనీత్ కౌర్ హాట్ లుక్స్

22 ఏండ్లకే సోషల్ మీడియాను ఊపేస్తోంది బాలీవుడ్ నటి, డాన్సర్ అవనీత్ కౌర్. గ్లామర్ షోలోనూ రెచ్చిపోతోంది. అయితే, రీసెంట్ గా ఈ బ్యూటీ పంచుకున్న ఓ వీడియోతో తీవ్రంగా ట్రోలింగ్ కు గురవుతోంది. టెలివిజన్ యాక్ట్రెస్ అవ్నీత్ కౌర్ 'డ్యాన్స్ ఇండియా డ్యాన్స్ లిల్ మాస్టర్స్'తో, 'డాన్స్ కే సూపర్‌స్టార్స్'తో హిందీలో బుల్లితెర ప్రేక్షకులకు బాగా దగ్గరైంది. నటిగా 2012లో 'మేరి మా'లో తొలిసారిగా నటించింది. అప్పటి నుండి వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఇక ప్రస్తుతం నటిగా వెండితెరపై ప్రేక్షకులను అలరిస్తోంది. కాగా, సోషల్ మీడియాలోనూ అవనీత్ కౌర్ రచ్చరంభోలా చేస్తోంది. తనకున్న క్రేజ్ కు ఇన్ స్టాగ్రామ్ లో 32.3 మిలియన్ల ఫాలోవర్స్ ను దక్కించుకుంది. దీంతో ఆమెను అభిమానించే వారి సంఖ్య ఎక్కువేనని అర్థం అవుతోంది.ప్రస్తుతం ఈ బ్యూటీకి 22 ఏండ్లు మాత్రమే. చిన్నపటి నుంచే టీవీ ఆడియెన్స్ కు బాగా కనెక్ట్ అయిన అవనీత్ కౌర్, నటిగానూ రాణిస్తుండటంతో అభిమానులు, ప్రేక్షకులకు ఖుషీ అవుతున్నారు. అయితే సోషల్ మీడియాలో ఈ బ్యూటీ చేసే రచ్చకు రగిలిపోతున్నారు.

